ప్రజాశక్తి
బుధవారం 10 ఏప్రిల్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

సత్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీధర్

కలెక్టరేట్‌లో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ప్రజలంతా సిరి సంపదలు, ఆయురారోగ్యాలు, విజయాలతో అభివద్ధి వైపు సాగాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ కోరారు. క్రోధి నామ తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలు బాపట్ల జిల్లా కలెక్టరేట్లో మంగళవారం ఘనంగా జరిగాయి. సంప్రదాయబద్ధంగా మంగళ వాయిద్యాలు, మేల తాళాలతో దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పురస్కారాలతో ముగ్గురు అర్చకులను జిల్లా సంయుక్త కలెక్టర్ సత్కరించారు. పండుగ సందర్భంగా తయారు చేసిన ఉగాది పచ్చడి, పంచాంగాలను పలువురికి పంపిణీ చేశారు. బాపట్ల జిల్లా ప్రజలంతా శుభిక్షంగా ఉండాలని జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్ అన్నారు. దిన దినాభివద్ధిలో బాపట్ల జిల్లా ముందుకు వెళ్లాలంటే ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పాడిపంటలు మరింత వృద్ధి చెందాలని, ప్రజలు ఆనందంగా గడపాలని కోరారు. తెలుగు నూతన సంవత్సరం ప్రారంభం నుండే కొత్త లక్ష్యాలు, విజయాలవైపు అడుగులు వేయాలన్నారు. ఉగాది పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, దేవాదాయ శాఖ డిప్యూటీ ఇన్ స్పెక్టర్ శ్యామల, పర్యవేక్షకులు రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

జిల్లా సమస్యలు పక్కదారి..

- ప్రధాన పార్టీల ఎజెండాలో ఏ ఒక్కటీ కనిపించని తీరు
- ఒకరిపై ఒకరు ఆరోపణలు.. ఓట్ల కోసం వ్యక్తిగత విమర్శలే..
- సిఎం జగన్, టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనల్లో సుస్పష్టం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికలు ఊపందుకునే దశలో జిల్లాలో ప్రధానమైన ఏ ఒక్క సమస్య కూడా పార్టీల ఎజెండాలో కనిపించడం లేదు. నిన్నమొన్నటి వరకూ ఏఏ అంశాలు ప్రజల్లో ఉన్నాయో వాటిపై అరకొరగానైనా మాట్లాడారు. హామీలు ఇచ్చే యత్నం చేశారు. ఇప్పుడు రానురానూ అవి పక్కదారి పడుతున్నాయి. కీలకమైన ప్రజా అవసరాలు.. పెండింగు ప్రాజెక్టులు, నిర్వాసితులు.. తాగునీటి ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి, ఫ్లోరిన్ సమస్య, విద్య వైద్య రంగాల్లో ఉన్న అవసరాలు వంటివి దాదాపుగా కనిపించడం లేదు. వీటిపై ఇప్పుడు అభ్యర్థులు మాట్లాడటం లేదు. ప్రధాన పార్టీల అధినేతల ప్రసంగాల్లోనూ కనిపించడం లేదు.

ఎన్నికల కోడ్ వచ్చాక ముందుగా ప్రతిపక్ష నేత చంద్రబాబు, తర్వాత సిఎం జగన్ జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బహిరంగ సభల్లో మాట్లాడారు. ఇద్దరి ఉపన్యాసాలు చూస్తే జిల్లాకు వాళ్లిచ్చిన ప్రాధాన్యత ఏమిటనేది విదితమవుతోంది. ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు, విమర్శలు తప్ప ఇంకేమీ లేవు. ఎన్నికల్లో ఓట్ల కోసం తప్ప ఆరోపణలు తప్ప జిల్లా అభివృద్ధికి ఏమాత్రం ఎజెండాలో చోటు కనిపించడం లేదు. రాష్ట్రస్థాయిలో కొన్ని సంక్షేమ పథకాలు, ఆకర్షణ పథకాలే కనిపిస్తున్నాయి. మార్కాపురం చంద్రబాబు పర్యటనలో ఆయన ప్రసంగంలోనూ సిఎం జగన్‌పైనే విమర్శలకు ఎక్కువ ప్రాధాన్యత కనిపించింది. సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. మార్కాపురం జిల్లాను గతంలోనే ప్రకటించారు. దాన్ని మళ్లీ ప్రస్తావించారు. వెలుగొండ ప్రాజెక్టును ఇటీవలే పూర్తి చేయకుండానే సిఎం జగన్ ప్రారంభించారని ఆరోపించారు. నిర్వాసితులకు ఇప్పటికీ ప్యాకేజీలు ఇవ్వలేదు. దీనిపై సిఎం జగన్ నుంచీ స్పష్టత లేదు. ప్రారంభం రోజునే మళ్లీ అధికారంలోకి వచ్చాక జూన్‌లో ఇస్తామని చెప్పి వెళ్లారు. నిర్వాసితులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరికి చంద్రబాబు నుంచి కూడా భరోసా కనిపించలేదు. అధికారంలోకి రాగానే ప్యాకేజీలు ఇస్తామనే మాట కూడా రాలేదు. వారి ప్రస్తావన ఇటు తెలుగుదేశం అధినేత చంద్రబాబులోనూ కనిపించలేదనే చర్చ నడుస్తోంది. పశ్చిమ ప్రాంత అభివృద్ధికి అనేక డిమాండ్లున్నాయి. మార్కాపురం జిల్లాతో పాటు ఆ ప్రాంతంలో కరువు, తాగునీరు, బోర్లు ఎండిపోవడం వంటి సమస్యలున్నాయి. సీజన్‌లో పండే టమోటా, అరటి వంటి వాటికి గిట్టుబాటు ధరల్లేవు. నిల్వ చేసే గిడ్డంగులు లేవు. ఉపాధికి ప్రతిపాదించిన కనిగిరి, దొనకొండ సెజ్‌లపైనా చర్చ లేదు. వీటిని చేపడతామని సిఎం జగన్ గానీ, ప్రతిపక్ష నేత చంద్రబాబు గానీ చెప్పడం లేదు. ఎన్నికల సభలో వీటికి ▶ 2లో

బెడిసికొట్టిన వైసిపి ఇన్‌ఛార్జుల మార్పు

- పర్చూరులో టిడిపిలోకి పెరిగిన వలసలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల్లో వరుసగా టిడిపి అభ్యర్థులు గెలుపొందుతున్న అసెంబ్లీ స్థానాలను ఈ సారి ఎలాగయినా కైవసం చేసుకోవాలన్న ధ్యేయంతో వైసిపి అధిష్టానం రచించిన వ్యూహాలు ఆచరణలో బెడిసికొడుతున్నాయి. ప్రధానంగా జిల్లాలోని పర్చూరు, అద్దంకి స్థానాలపై వైసిపి అధిష్టానం ఈ ఎన్నికల్లో ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. పర్చూరు నియోజకవర్గం నుంచి 2014, 2019 ఎన్నికల్లో టిడిపి తరఫున పోటీ చేసిన ఏలూరి సాంబశివరావు గెలుపొందారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చారు. ఈ ఎన్నికల్లో మూడోసారి పోటీ చేస్తున్నారు.

గడిచిన దశాబ్దకాలంగా వైసిపి అధిష్టానం పర్చూరుపై చేసిన రాజకీయ ప్రయోగాలు వికటించడంతో ఉన్న క్యాడర్ డీలా పడిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా బలమైన నేతను ఎన్నికల బరిలో నిలపాలన్న ప్రయత్నాలు బెడిసికొట్టాయి. 2014 ఎన్నికల్లో ఏలూరిపై వైసిపి తరఫున గొట్టిపాటి భరత్ పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల అనంతరం భరత్ స్థానంలో రావి రామనాథంబాబును పర్చూరు వైపిపి ఇన్‌ఛార్జిగా నియమించారు. కానీ 2019 ఎన్నికల నాటికి రామనాథం బాబును పక్కనపెట్టి పర్చూరు ప్రాంత ప్రజలకు సుపరిచితులయిన మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావును బలమైన అభ్యర్థిగా భావించి వైపిపి తరఫున పోటీ చేయించారు. రామనాథంబాబును పక్కన పెట్టడం వల్ల ఆయన టిడిపికి సహకరించారు. దగ్గుబాటి ఓటమికి ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైపిసికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి దగ్గుబాటి వెంకటేశ్వరరావు తప్పుకోవడం జరిగింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో మళ్లీ రావి రామనాథంబాబును పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన అధిష్టానం పిలుపు మేరకు నియోజకవర్గంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇల్లిల్లూ తిరిగారు. రాష్టంలో ప్రథమస్థానంలో నిలిచారు. అయితే ఎన్నికల సర్వేలు రామనాథం బాబుకు అనుకూలంగా లేవంటూ.. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరుకు ఇన్‌ఛార్జిగా తెచ్చారు. కానీ ఆమంచి వ్యవహార శైలితో పర్చూరులో గ్రూపుల పోరు పెరిగింది. ఆమంచి చేపట్టిన ఓట్ల తొలగింపు అంశం బెడిసికొట్టింది. కొన్ని వర్గాల వారు పార్టీకి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. అయినా పార్టీ అధినేత జగన్ ఇవేమి పట్టించుకోకుండా ఆమంచినే పర్చూరు నుంచి పోటీ చెయ్యమని చెప్పారు. అయినప్పటికీ మొదటి నుంచి చీరాల నుంచే ఎన్నికల్లో పోటీ చెయ్యాలన్న ఆలోచనతో ఉన్న ఆమంచి పర్చూరు నుంచి వైదొలిగారు. ఆమంచి పర్చూరు ఇన్‌ఛార్జిగా ఉన్న సమయంలో ఆయన తీరును వ్యతిరేకించారనే కారణంగా ఇంకొల్లు వైసిపి నేత, జడ్పీటీసీ భర్త భవనం శ్రీనివాసరెడ్డిని పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. చివరికి ఆమంచి కూడా ఆ పార్టీలో లేకుండా పోయాడు. పర్చూరు నుంచీ వెళ్లిపోయారు. దీంతో చీరాలకే చెందిన యడం బాలాజిని పర్చూరు నుంచి వైపిసి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపారు. వరుసగా వైసిపి ఇన్‌ఛార్జిల మార్పులతో స్థానిక వైసిపి క్యాడర్ పరిస్థితి అగమ్యగోచరం అయ్యింది. పర్చూరుకు బాలాజీని అభ్యర్థిగా పార్టీ అధిష్టానం పంపిందే తప్ప తగిన సహకారం లేకపోయింది. ఆమంచి ఇన్‌ఛార్జిగా వచ్చిన సమయంలో రాష్ట, జిల్లా స్థాయి నేతలు వచ్చి పెద్ద సభ పెట్టి హంగామా చేశారు. కానీ బాలాజీ వచ్చాక పార్టీ కార్యాలయం ప్రారంభానికి కూడా నేతలెవరూ హాజరయిన దాఖలాలు లేవు. దీంతో యడం బాలాజీది ఒకరకంగా ఒంటరి పోరాటం అయ్యింది. వరుసగా ఇన్‌ఛార్జిల మార్పుతో వైసిపి క్యాడర్ ఎవరి వెంటా నడిచే పరిస్థితి లేకపోయింది. గడిచిన ▶ 2లో

మూతపడ్డ షెడ్డు..

రోడ్డున పడ్డ కార్మికులు

'వైజాగ్' ఎఫెక్ట్‌తో.. మూతపడ్డ ఆక్వా షెడ్లు

▶ 8లో

కాన్వాయ్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీరామ్, పక్కనే నిలుచున్న మంత్రి సురేష్

మంత్రి సురేష్ కాన్వాయ్ తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఎన్నికల నేపథ్యంలో తనిఖీలలో భాగంగా రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్యానాయ్‌ను కూడా మంగళవారం మండలంలోని మూల గుంటపాడు గ్రామపంచాయతీలోని వెంకటేశ్వర కాలనీ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. శింగ రాయకొండ ఎస్ఐ టి.శ్రీరామ్ బార్డర్ సెక్యూ రిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తుండగా.. మంత్రి కాన్వాయ్ శింగరాయకొండ నుంచి జరుగుమల్లి వెళుతూ అటువైపు వచ్చింది. ఎస్ఐ టి.శ్రీరామ్ కాన్వాయ్‌ను ఆపి తనిఖీ చేయాలని చెప్పారు. దీంతో మంత్రి సురేష్ వాహనంలో నుంచి దిగి పక్కకు వెళ్లారు. ఆయన వాహనాన్ని, కాన్వాయ్‌లోని మరో రెండు వాహనాలను ఎస్ఐ టి.శ్రీరామ్ ఆధ్వర్యంలో పోలీసులు పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం మంత్రి సురేష్ వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జిల్లా సమస్యలు పక్కదారి..

(మొదటిపేజీ తరువాయి)

ఏ మాత్రం ప్రాధాన్యత లేదు. సిఎం జగన్ కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజవర్గాల్లో పర్యటించారు. బస్సులో ప్రయాణిస్తూ ప్రచారం చేశారు. దొనకొండ అడ్డరోడ్డులో జరిగిన సభలోనూ నేరుగా చంద్రబాబుపైనే విమర్శలకు ప్రాధాన్యత ఇచ్చారు. 2014లో ఆయన ఇచ్చిన హామీల పత్రాన్ని చూపుతూ ఏమీ అమలు చేయలేదని చెబుతూ.. ఆయనకు ఓటేస్తే పులినోట్లో తలపెట్టినట్లేనని వ్యాఖ్యానించారు. జిల్లాలో ఉన్న పెండింగు ప్రాజెక్టులు గానీ, పరిశ్రమలు, సాగునీరు, తాగునీరు, కరువు, ఉపాధి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఏమైనా చేస్తామనే మాట కూడా వినిపించలేదు. దర్శి సమీపంలో పింఛనుదారులతో ముఖాముఖి నిర్వహించారు. అంతా పింఛను రాజకీయమే అక్కడ సాగింది. ఎంపిక చేసిన కొందరు పార్టీ అభిమానులతో చంద్రబాబుపై విమర్శలు చేయించారు. వాలంటీర్లు ఇంటికి వచ్చి పింఛను ఇస్తుంటే చంద్రబాబు ఆపాడని కొందరు ఆవేశంగా మాట్లాడారు. కనీసం దర్శి నియోజకవర్గంలో ఉన్న సమస్యలపైనా కనీసం ప్రస్తావన లేదు. సాగర్ ఆయకట్టు ప్రాంతంగా ఉన్న దర్శి వ్యవసాయపరంగా ఎదుర్కొంటున్న ఒడిదుడుకులపై ప్రస్తావన లేదు. ఇదే నియోజకవర్గంలో ఉన్న దొనకొండ పరిశ్రమల కేంద్రం మాటే లేదు. కనిగిరికి ఏం చేస్తామన్నారంటే చెప్పుకోవడానికే లేదు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే తీరు. సిఎం స్థాయిలో పరిష్కారం చేసే సమస్యలు లేవా? ఉన్నా అభ్యర్థులు ఏమీ చెప్పలేదా? అన్నదీ ఆలోచించాలి. ఇప్పటికీ కనిగిని నియోజకవర్గానికి తాగునీరు లేదు. ఫ్లోరిన్‌తో కిడ్నీ వ్యాధులు కొనసాగుతున్నాయి. కేవలం పింఛన్లు.. బటన్ నొక్కితే పడే డబ్బులే.. పార్టీలకు ప్రధాన ఎజెండాలుగా మారాయి. వీటి చుట్టూనే అంతా నడుస్తోంది. సంక్షేమ పథకాలు ఒక భాగంగానే ఉండాలి. అభివృద్ధి పార్శ్వాన్ని పూర్తిగా మరిచారు. ఓట్లు రాల్చే పథకాలకే ప్రాధాన్యతలు ఇస్తున్నారు. ఇప్పుడు అభ్యర్థులు కూడా ఈ పథకాలతో ముద్రించిన కరపత్రాలతోనే ప్రచారం సాగిస్తున్నారు. మౌలిక సమస్యలపై ఎవరికీ దృష్టి లేదని చెప్పకనే తెలుస్తోంది.

బెడిసికొట్టిన వైసిపి ఇన్‌ఛార్జుల మార్పు

(మొదటిపేజీ తరువాయి)

ఐదేళ్ళలో స్థానికంగా పనులు చేపట్టిన వైసిపి వర్గీయులు నష్టపోయిన వారే అధికంగా ఉన్నారు. ఒక వైపు టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గ్రామగ్రామాన తిరుగుతూ ఓటర్లను ఆకట్టుకుంటుంటే వైసిపి అభ్యర్థి వారిని నిలువరించే పరిస్థితి కూడా లేకపోయింది. చివరికి తన కాపు సామాజిక వర్గానికి చెందిన వారిని కూడా టిడిపి వైపు వెళ్లకుండా ఆపలేకపోయారు. చినగంజాం మండలం నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కూడా భారీ సంఖ్యలో టిడిపిలోకి వెళ్ళేందుకు సన్నద్ధమయ్యారు. మాజీ మంత్రి బాలినేని జోక్యం చేసుకున్నా వారు ఆగే పరిస్థితి లేకపోయింది. కారంచేడు మండలం నుంచి కూడా మొదటి నుంచి వైసిపిని అంటిపెట్టుకుని ఉన్న కాపు, కమ్మ సామాజిక వర్గాల నేతలు అసంతృప్తితో ఉన్నారు. నియోజకవర్గంలో ఉన్న మార్టూరు, యద్దనపూడిల నుంచి టిడిపిలోకి వలసలు పెరిగాయి.

కవితల పోటీ విజేతలు వీరే..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: ఓటరు చైతన్యంపై నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) కవితల పోటీలకు విశేష స్పందన లభించింది. అచ్చంగా కవయిత్రులకు మాత్రమే జరిపిన ఈ కవితల పోటీల విజేతలను సంస్థ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ప్రకటించారు. వరుసగా ప్రథమ బహుమతిని రోహిణి వంజారి(మరవబోకు) కోకాపేట, హైదరాబాద్, ద్వితీయ బహుమతిని శ్రీదేవి (ఓటరై గెలువు) పాలకొల్లు, పశ్చిమ గోదావరి, తృతీయ బహుమతిని బి కళాగోపాల్ (ఇక్కడ ఓట్లు అమ్ముడుబోవు) నిజామాబాద్ వాళ్ళు గెలుచుకున్నారని తెలియజేశారు. అదేవిధంగా ప్రోత్సాహక బహుమతులను సంధ్యాశర్మ (ఒక్కడిగా) చిత్తూరు, కవితాదేవి (నేను సైతం ఓటు వేస్తా) కర్నూలు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలందరికీ నరసం అధ్యక్షురాలు చిన్నలక్ష్మి కళావతి, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు చివుకుల శ్రీలక్ష్మి, దండెబోయిన పార్వతి, సింహాద్రి జ్యోతిర్మయి అభినందనలు తెలియజేశారు.

తీరని దాహార్తి..

- తడారుతున్న గొంతులు
- నీటి ట్యాంకర్ల కోసం తప్పని నిరీక్షణ
- అల్లాడుతున్న గ్రామీణులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఈ వేసవిలో జిల్లాలో నీటి ఇక్కట్లు తీవ్రరూపం దాల్చనున్నాయి. ఇప్పటికే పశ్చిమ ప్రాంతంలోని 11 మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. చాలా గ్రామాల్లో 500 నుంచి 700 అడుగుల లోతులో ఉన్న బోర్లలో నీరు రాకపోతుండగా వెయ్యి అడుగుల లోతు ఉన్న బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. ప్రస్తుత జిల్లా పరిధిలో చిన్న పెద్ద, గ్రామస్థాయి నీటిపథకాలు 2,858 ఉండగా 315 వనరుల్లో నీటి లభ్యత లేక నిలిచిపోయాయి. 17,692 బోర్లలో 2,518 బోర్లు ఎండిపోయాయి. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలం కొన్నిచోట్ల ఆందోళనకరంగానే కనిపిస్తోంది. జిల్లాలో మార్చి ఆఖరు నాటికి సగటున 10.38 మీటర్ల లోతులో భూగర్భ జలం ఉండగా త్రిపురాంతకం మండలం మిట్ట పాలెంలో గరిష్ఠంగా 96.70 మీటర్ల లోతులో ఉంది. యర్రగొండపాలెం మండలం బోయలపల్లిలో 53.30 మీటర్లు, మార్కాపురం మండలం నికరంపల్లిలో 35 మీటర్ల లోతులో ఉన్నాయి. అలా 25 మీటర్ల దిగువకు భూగర్భ జల మట్టం 11 మండలాల్లోని 91 గ్రామాల్లో పడిపోగా వాటిలో బోర్లు వేయరాదన్న ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఏప్రిల్ తొలివారం నాటికి పరిస్థితి ఇలా ఉండగా నెలాఖరు నాటికి సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో..

ముటుకుల ప్రాజెక్టు పనిచేయక పుల్లలచెరువు మండలంలో నీటిసమస్య అధికంగా ఉంది. దూపాడు-1 ట్యాంకు నుంచి వైపాలెం, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో 55 గ్రామాలకు నీరు అందించాల్సి ఉండగా 16 గ్రామాలకే అందుతోంది. ఈ పథకం ద్వారా పెద్దారవీడు మండలంలో 18 గ్రామాలకు నీరందాల్సి ఉండగా 13 గ్రామాలకు నాలుగైదు రోజులకొకసారి అరకొరగా ఇస్తున్నారు. దోర్నాల మండలంలో ఐదు గ్రామాలకు నీరు ఇవ్వాల్సి ఉండగా ఒక్క గ్రామానికి కూడా ఇవ్వడం లేదు. గొల్లపల్లి పథకం కింద కూడా అరకొరగానే నీటి సరఫరా జరుగుతోంది. యర్రగొండపాలెం మండలం గుర్రపుశాలలో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో ఉన్న ఒకే ఒక్క బోరులో కొంచెంగా నీళ్లు వస్తున్నాయి. మోటారు రోజంతా ఆన్ చేస్తే ట్యాంకర్ నిండుతోంది. ట్యాంకర్ నిండితే నీటిని పట్టుకుంటున్నారు. దీంతో మహిళలు బిందెలను తోపుడు బండిపై పెట్టుకొని ఒకేసారి అక్కడి వచ్చి పట్టుకెళుతున్నారు. గంటల తరబడి ట్యాంకర్ వద్దకు వచ్చి నిలబడి బిందెల్లో నీరు నింపుకొని కష్టపడి తీసుకొని వెళుతున్నారు. నీళ్లు ఉన్నప్పుడే తీసుకెళ్లాలి, మళ్లీ వస్తాయో రావో తెలీదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లలచెరువు మండల కేంద్రంలో ఊరు మధ్యలో ఉన్న చెరువు ఎండిపోయింది. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఇంకో చెరువులో కొద్ది నీళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఒట్టి పోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రెండు నెలల్లో తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు (ఫైల్)

ఇంటి ముందు డ్రమ్ములు

చేతి పంపులు ఇలా..

యర్రగొండపాలెం మండలంలో 413 చేతి పంపులు ఉండగా 39 మాత్రమే పని చేస్తున్నాయి. త్రిపురాంతకం మండలంలో 379కి గాను 299, పుల్లలచెరువు మండలంలో 369కి గాను 81, పెద్దారవీడు మండలంలో 303కు గాను 31, పెద్దదోర్నాల మండలంలో 292కు గాను 21 చొప్పున చేతి పంపులు మాత్రమే పని చేస్తున్నాయి. గతంలో బోర్ల మరమ్మతులకు మండల పరిషత్ పరిధిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసేవారు. కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల మేరకు కార్యాలయం నుంచి నిధులు కేటాయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీనికి తోడు ఎన్నికల నేపథ్యంలో మండలాలకు కొత్త అధికారులను నియమించడంతో వారు పట్టించుకునే పరిస్థితి లేదు.

ఆందోళన బాటలో ప్రజలు..

నీటి కోసం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రతిరోజూ ఏదో ఒక చోట ఖాళీ బిందెలతో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. గ్రామాల్లో ఉన్న చేతి బోర్లు, మోటార్లు మరమ్మతులు చేయడానికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు. అయితే ఎన్నికల నేపథ్యంలో అధికారులు సరిగ్గా పట్టించుకోకపోవడంతో కొన్ని గ్రామాల్లో దాతల సహకారంతో కొందరు పొలాల్లోని వ్యవసాయ బోర్ల దగ్గర మరికొందరు నీళ్లను తెచ్చుకొని పొదుపుగా వాడుకుంటున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నీటి ఎద్దడికి నివారణకు

మాజీ ప్రజాప్రతినిధుల ట్యాంకర్లు

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి నగర పంచాయతీ లో నీటి ఎద్దడి నివారణకు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. 11వ వార్డులో ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన మాజీ ఎంపిటిసి, మాజీ వార్డు సభ్యులు సయ్యద్ ఇమాంసాహెబ్, మాజీ వార్డు సభ్యులు కరిమూన్‌లు స్పందించి మంగళవారం తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ట్యాంకర్లను ప్రారంభించారు. పట్టణంలోని ప్రజలు తమకు మంచినీటి సమస్య వచ్చినా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణంలో నీటి సరఫరాను ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

రిబ్బను కత్తిరింపుతో సరి..

ప్రజలకు కుదరని గురి

యర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రిలో కానరాని మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో రూ.23 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఏరియా వంద పడకల వైద్యశాలను నిర్మించారు. గత ఏడాది నవంబర్‌కే భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆసుపత్రి ప్రారంభించడంలో తీవ్ర జాప్యం జరిగింది. యర్రగొండపాలెంలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్‌ను కొండపికి సమన్వయకర్తగా పంపడంతో యర్రగొండపాలెం నియోజకవర్గానికి తాటిపర్తి చంద్రశేఖర్ సమన్వయకర్తగా వచ్చారు. వీరిద్దరూ సమన్వయం చేసుకొని ప్రారంభించాల్సిన ఏరియా వైద్యశాల సమన్వయం కొరవడడంతో చతికెల పడింది. వీరిద్దరి మధ్య వైద్యశాఖ అధికారులు నలిగిపోయారు. కోడ్ వస్తే మరో మూడు నెలలు ప్రారంభానికి జాప్యం అవుతుందని ఎట్టకేలకు ఈ నెల 14వ తేదీన నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ చేత ప్రారంభోత్సవం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సురేష్ హాజరు కాలేదు. అయితే భవన సముదాయాన్ని రిబ్బన్లు కత్తిరించి ప్రారంభించారే తప్ప ఇటు పాలకులు, అటు అధికారులు పట్టించుకోలేదని రోగులు వాపోతున్నారు. భవనాల ప్రారంభోత్సవంలో ఉన్న శ్రద్ధ వాటి వినియోగంలోకి తీసుకురావడంపై పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.

యర్రగొండపాలెం ఏరియా వైద్యశాల

మెరుగైన వైద్యం దైన్యం..

నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో ఐదు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించిన ఈ భవనాన్ని ప్రారంభించినప్పటికీ నూతన భవన సదుపాయంలో ఇప్పటి వరకు వైద్యసేవలు ప్రారంభం కాలేదు. లోపల చిన్న చిన్న పనులు చేపట్టాల్సి ఉంది. వైద్యులు, సిబ్బంది స్థాయిని పెంచలేదు. అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేయలేదు. కనీసం శుద్ధజల కేంద్రం కూడా పని చేయడం లేదు. దీంతో కొత్త భవనం అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రజలు భావించినా ఆ దిశగా అడుగులు పడలేదు. అన్ని సౌకర్యాలు కల్పించి వైద్యుల స్థాయిని పెంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బైకు అదుతప్పి బోల్తా.. చిన్నారి మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

బైకు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కట్టుబడిపాలెం, వెన్నూరు గ్రామాల మధ్య మంగళవారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.... మండల పరిధిలోని గోగినేనివారిపాలెంకు చెందిన గోగినేని సురేష్, శాంతి దంపతులకు కుమార్తె యశ్వంత్‌లక్ష్మి, కుమారుడు దేవాంజ్ ఉన్నారు. సురేష్ కొండపిలోని ఎన్‌టిఆర్ కూడలి వద్ద జూస్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో

మృతి చెందిన గోగినేని యశ్వంత్‌లక్ష్మి

సురేష్ భార్య శాంతి కందుకూరు మండల పరిధిలోని కొండముడుసుపాలెంలో నున్న తమ అమ్మమ్మ ఇంటికి ఇటీవల వెళ్లింది. మంగళవారం కుమార్తె, కుమారుడిని తీసుకొని బైకు గోగినేనివారిపాలెం గ్రామానికి వస్తుంది. ఈ క్రమంలో ఘటన స్థలం వద్దకు వచ్చేసరికి బైకు అదుపు తప్పింది. రోడ్డు ప్రక్కనే ఉన్న గోతిలోకి బోల్తా కొట్టింది. దీంతో శాంతి, కుమార్తె యశ్వంత్‌లక్ష్మి (9), కుమారుడు దేవాంజ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమంచిన తోటి ప్రయాణికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది ఘటానా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఒంగోలు తరలించారు. అప్పటికే యశ్వంత్‌లక్ష్మి మృతి చెందింది. శాంతి, దేవాంజ్ ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది తున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉంది.

ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పాఠశాలలో ఉపాధ్యాయు రాలిగా పనిచేస్తున్న రచయిత్రి, కవయిత్రి కనుమర్ల పూడి సావిత్రి ఉగాది పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యా యురాలిగా ఉత్తమ సేవలందించి నందుకు గానూ కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన హాలులో ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో సావిత్రికి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చేతుల మీదుగా పురస్కారం అందజేసి సన్మానించారు. తొలుత మఠంపల్లి దక్షిణా మూర్తి పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు తన్నీరు బాలాజీ , మద్దిరాల శ్రీనివాసులు, నాగ కుమార శర్మను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఈదుమూడి ఆంజనేయులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు సావిత్రి

కృష్ణకిశోర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కృష్ణ కిశోర్ జన్మదినవేడుకలు

ప్రజాశక్తి - గిద్దలూరు

మాజీ ఎమ్మెల్యే, టిడిపి కూటమి గిద్దలూరు నియోజక అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కష్ణ కిశోర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానుల మధ్య కృష్ణకిశోర్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం పలువురు నాయకులు కృష్ణకిశోర్‌ను సన్మానించి జన్మదిన శు భాకాంక్షతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జనసేన ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-దర్శి

జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక అద్దంకి రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. దర్శి నియోజకవర్గ పరిధిలోని జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గరికపాటి అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని గరికపాటి వెంకట్ కోరారు.

ఆలపాటికి మాతృవియోగం

ప్రజాశక్తి-చీమకుర్తి

మద్దిపాడు ఎఎంసి మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఆలపాటి నరసింహారావు మాతృ వియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి ఆలపాటి భారతి (80) గుండెపోటుతో మృతి చెందారు. భారతికి సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో చీమకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. మంగళవారం సాయంత్రం భారతి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భారతి మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఆమె కుమారులు ఆలపాటినరసింహారావు, ఆలపాటి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మద్దిపాడు ఎంఎంసి మాజీ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి జవహర్,డైరెక్టర్ చలువాది రమేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొండవేటి ప్రసాదు,కె. వడ్డికాసులు, మల్లికార్జునరావు, ఆర్యవైశ్యసంఘం, వాసవీ సంఘం నాయకులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మారం వెంకారెడ్డి

విద్యుత్ మోటార్లు అపహరణ

ప్రజాశక్తి-పిసిపల్లి

గుర్తుతెలియని వ్యక్తులు రెండు విద్యుత్ మోటార్లను అపహరించారు. ఈ ఘటన మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన నలబోలు నారాయణ, మరో రైతుకు చెందిన రూ.80 వేల విలువైన రెండు విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. బాధిత రైతు నారాయణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మారేళ్ళ చెరువు కట్టకు ఉత్తరం వైపు రోడ్డు ఆనుకొని ఉన్న వ్యవసాయ బావిలోని మోటార్లను, విద్యుత్ వైర్లను, ఇనుప పైపులను తొలగించి మోటార్లను తీసుకెళ్లినట్లు నారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నాడు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని పెద్దకండ్లగుంట గ్రామానికి చెందిన గర్నిపూడి రమేష్ ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని వైసిపి కొండపి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం ప్రారంభించారు. గర్నిపూడి కొండయ్య,లక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, జి.మురళి , వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని మైలిచర్ల అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కేంద్రాలపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. పామూరు సిఐ రామ్‌నాయక్, సిఎస్‌పురం ఎస్ఐ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సారా తయారీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ ఉపయోగించే 30 కిలోల బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ రామనాయక్ మాట్లాడుతూ ఎవరైనా సారా తయారీ చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

చేపల వేట కెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పూడిలో చిక్కుకొని ఎండ తీవ్రతకు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉల్లగల్లు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...ఉల్లగల్లు ఎస్‌సి కాలనీకి చెందిన తప్పెట బాలసుందరరావు(50) కాలనీకి సమీపంలోని నాగమ్మకుంటలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు వేటాడుతున్న సమయంలో ప్రమాదవ శాత్తు పూడులో ఇరుక్కుపోయాడు. ఎంతకీ బయటకు రాలేకపోయాడు. ఎండ తీవ్రతో మృతిచెందాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన కొందరు చేపల వేట కోసం నాగమ్మ కుంట వద్దకు వెళ్లారు. వారు బాలసుందరరావు మృతి చెంది ఉండటాన్ని గమనించి కాలనీ వాసులకు సమాచారం అందించారు. కాలనీ వాసులు కుంటవద్దకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు.మృతుడు బాలసుందర రావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న ఆటో మహిళ దుర్మరణం

పజాశక్తి - చీరాల

ఆటో ఎడ్ల బండికి తగిలిన ఘటనలో ఓ మహిళ దుర్మరణం చెందింది. మరో మహిళలకు గాయాల య్యాయి. ఈ ఘటన చీరాల–వేటపాలెం జాతీయ రహదారిలో మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... వేటపాలెం మండలం కొణిజేటి చేనేతపురి కాలనీకి చెందిన ఎస్‌కె. మస్తాని (50) మరి కొందరూ మహిళలతో కలిసి మిరపల కోతకు ఆటోలో వెళ్తున్నారు. ఘటనా స్థలం వెళ్లే సరికి ఆటో టైరు బండికి తగిలింది. దీంతో మస్తానికి, పద్మ అనే మహిళకు గాలయ్యాయి. స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మస్తాని మృతిచెందింది. వేటపాలెం ఎస్ఐ సురేష్ కేసు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

మృతిచెందిన మస్తాని

ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి హర్షవర్ధన్

అడవిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి హర్షవర్ధన్

ప్రజాశక్తి-సంతమాగులూరు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు నాయుడుకే సాధ్యమని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ తెలిపారు. మంగళవారం మండలంలోని అడవిపాలెం గ్రామంలో తన తండ్రి కూటమి అభ్యర్థి అయిన గొట్టిపాటి రవికుమార్ తరపున ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాల అమలు హామీలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ జగన్ మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికీ మేలు జరగలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారన్నారు. పేదలకు ఉపయోగపడే పలు పథకాలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు తమ ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాడిపర్తి వెంకటరావు, చింతా శ్రీధర్, గోగినేని అశోక్, ముంద్రు వెంకటేశ్వర్లు, దిండు హనుమంతరావు, అట్లా పెద్ద వెంకటరెడ్డి, చేవూరి వాసురెడ్డి, ధూపాటి ఏసోబు, మాదాల సుబ్బారావు, కొనికి గోవిందమ్మ, తేలప్రోలు రమేష్, ఆలూరి శ్రీనివాసరావు, గుండపునేని సురేష్, డి గాలెయ్య, నాగబోతు సుజాత, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

పాలాభిషేకం దృశ్యం

ప్రజాశక్తి-బాపట్ల

దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ పెంచనున్నట్లు చంద్ర బాబు ప్రకటించడంపై బాపట్ల భావపురి దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళ వారం పట్టణంలోని బేతని కాలనీలో విభిన్న ప్రతిభావంతుల బాపట్ల నియోజకవర్గ అధ్యక్షుడు పాత్రు బాలసుందర్ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు, సోమల ప్రసాద్, పాత్రు లక్ష్మి, రాజారావు, నరసింహారావు, అన్నమ్మ, ఇజ్రాయిల్, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వాహకులకు ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

బధిరుల పాఠశాలకు ఫ్యాన్‌ల బహూకరణ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం నాగులపాలెం గ్రామంలోని నాగు బడి రంగయ్య, అచ్చమ్మ బధిరుల పాఠశాల విద్యార్థులకు వసతి గదులకు ఉపయోగపడే విధంగా రెండు గోడలకు బిగించే ఫ్యాన్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల వీరారెడ్డి జ్ఞాపకార్థం భార్య నిర్మలాదేవి బహూకరించారు. పంపిణీ అనంతరం విద్యార్థులతో కలిసి ఉగాది వేడుకలు నిర్వహించుకుని ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని సేవా కార్యక్రమాలు అందజేస్తామని నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు భవనం రాజగోపాల్‌రెడ్డి, రావి సత్యనారాయణ, తేళ్ల రమేష్ చంద్ర, నాగుబడి సుబ్బారావు, కోమటి ఆంజనేయులు, స్కూలు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం చెన్నకేశవ ఆలయంలో పంచాంగ పఠనం

ఘనంగా ఉగాది గ్రామోత్సవం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఉగాది సందర్భంగా సంతనూతలపాడులోని కోదండ రామస్వామి ఆలయంలోని కోదండరామ సీత లక్ష్మణ స్వామివార్లకు మంగళవారం ఉగాది గ్రామోత్సవం నిర్వహించారు. ఉగాది గ్రామోత్సవానికి వేమా వెంకట సుబ్బారావు సన్స్ దాతలుగా వ్యవరించారు. అర్చకులు హనుమత్ ఆచార్యులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి చలువాది వెంకటసుబ్బారావు పర్యవేక్షించగా దాతలు వి మల్లేశ్వరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం: క్రోధి నామ ఉగాది సందర్భంగా మార్కాపురం లక్ష్మీ చెన్నకేశవ దేవస్థానంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పెనుగొండ కేశవరావు, కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలు

అద్దంకిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సాహిత్యాభిమానులు

ప్రజాశక్తి-అద్దంకి

సృజన సాహితీ సంస్థ అద్దంకి సాయంత్రం కాళికా సమేత కమటేశ్వర స్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని సృజన కవిమిత్రులు, పురప్రముఖులు సృజన సాహిత్య సమావేశంలో పాల్గొన్నారు. సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర ఉగాదిని ఆహ్వానిస్తూ సృజన కవులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు మాటకు అఖండ గౌరవం సిద్ధించాలని సృజన కవులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రుద్రయ్య, రావూరి రంగయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, లక్కరాజు శ్రీనివాసరావు, ఆర్ రాఘవరెడ్డి, ఆర్‌వి రాఘవరావు, పాలపర్తి జ్యోతిష్మతి, యనమండ్ర వరలక్ష్మి, మహమ్మద్ రఫీ, అనంతు నాగేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, అళహరి హరిబాబు, జాగర్లమూడి ప్రతాప్, మల్లాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకర్‌రావు, వారణాసి రఘురామశర్మ, అద్దంకి లెవీ ప్రసాద్, చిన్ని రమేష్, మస్తాన్, మాస్టారు తమ్మన శ్రీనివాసరావు, ఇలపావులూరి శేష తల్పశాయి, పిఎల్‌వి నరసింహారావు, సాహితీ మిత్రులు, కవులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నరేంద్రవర్మ, కృష్ణ ప్రసాద్

రాష్ట్రాభివృద్ధికి చంద్రన్న రావాలి: వర్మ

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

పిట్టలవానిపాలెం మండలంలో కోడూరు, సంగుపాలెం, కోమలి, భవనంవారిపాలెంలో కూటమి అభ్యర్థి నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ గ్రామాల్లో స్థానిక సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వేగేశన నరేంద్రవర్మ ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది ఒక చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాలతో కూడిన నిరుపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ప్రజాపాలన సాధ్యమవుతుందన్నారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా వేగేశన నరేంద్ర వర్మని గెలిపించాలని కృష్ణ ప్రసాద్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త శ్రీమన్నారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడు నాగానందం కుటుంబానికి..

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

మాట్లాడుతున్న చేనేత నాయకులు మురుగుడు సత్యనారాయణ తదితరులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగం పట్ల అనుసరి స్తున్న విధానాల వలన నేడు చేనేత కార్మికులు కనీస జీవనం కొనసాగించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా కేసేపల్లి గ్రామానికి చెందిన నాగానందం(44) అనే చేనేత కార్మికుడు అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈయన కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూలు, రంగులు, రసాయనాలపై విధించిన జీఎస్టీ వలన నేడు వస్త్రాలు అమ్ముడుపోక నిల్వలు పేరుకుపోయి వస్త్ర తయారీకి చేసిన అప్పులు తీర్చలేక కార్మికులు నాన్న అవస్థలు పడుతూ ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రభుత్వం యార్న్ సబ్సిడీ, త్రి ఫండ్, పావలా వడ్డీ, ఆరోగ్య బీమా వంటి సంక్షేమ పథకాలు కూడా ఎత్తివేయడంతో చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాలను మార్పుచేసి కార్మికుల ఉపాధికి తగిన చర్యలు తీసుకొని చేనేత రంగ పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దులూరులో బీఎన్ ఎన్నికల ప్రచారం

ఆలయంలో పూజలు చేస్తున్న బిఎన్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మద్దులూరు గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్ విజయ్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు నువ్వుల మీరయ్య, రావులపల్లి సురేష్ బాబు, రంపతోటి అంకారావు, నాగేశ్వరావు, టీ నరసింహారావు, దాసరి రవి, కంకణాల గోపికృష్ణ, మాధవి, ఫణీంద్ర, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన అంబటి మురళీకృష్ణ

చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిన మురళీకృష్ణ

ప్రజాశక్తి-బాపట్ల

వైసిపిలో కీలక నేతగా కొనసాగుతున్న అంబటి రాంబాబు దగ్గరి బంధువు, బాపట్లకు చెందిన అంబటి మురళీకృష్ణ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మంగళ వారం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎన్నో ఏళ్లుగా అంబటి రాంబాబుకు, మురళీకృష్ణకు మద్దతుగా నిలిచిన అంబటి మురళీకృష్ణ (బాపట్ల) ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో చేరటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 2010లో ఆనాటి ఓదార్పు యాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వెదుళ్లపల్లిలో తన కార్యాలయంలో బస ఏర్పాట్లు చేశారు. 1989 నుంచి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటున్న అంబటి మురళీకృష్ణ ఏనాడూ పార్టీ పదవులను, నామినేటెడ్ పదవులను ఆశించలేదు. అయితే అంబటి మురళీకృష్ణ తెలుగుదేశం పార్టీలో చేరడం వెనుక కారణాలు అనేకం ఉన్నాయని, త్వరలో బహిరంగంగా వెల్లడించే అవకాశాలు ఉన్నాయని అంబటి మురళికి అత్యంత సన్నిహితులు తెలిపారు.

నూతన చైతన్యంతో సాగాలి ఉగాది

రాధాకష్ణమూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు ప్రజల్లో చైతన్యం, సమైక్యతా భావాలతో ఈ ఉగాది సుఖశాంతులు పంచాలని సీనియర్ సిటిజన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జీవీ బ్రహ్మం అన్నారు. మంగళవారం ఉగాది సందర్భంగా సాహితీ భారతి ఆధ్వర్యంలో పట్టణంలో సీనియర్ సిటిజన్ కార్యాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీవీ బ్రహ్మం పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రజా వైద్యులు కవి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడి సమాజంలో పేరుకుపోతున్న రోగాలతోపాటు కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని అన్నారు. క్రోధి నామ సంవత్సరంలో క్రోధాన్ని తగ్గించుకొని సమాజ సేవకు పాటుపడాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పండితులు, భాషా ప్రవీణ, ఉత్తమ అధ్యాపకులు రెంటాల రాధాకృష్ణమూర్తిని సాహితీ భారతి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. షేక్ మస్తాన్‌వలి ఉగాది కవితను చదివి వినిపించారు. కార్యక్రమంలో సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ, మర్రి మాల్యాద్రిరావు, విశ్రాంత అధ్యాపకులు జీవీ సుబ్రహ్మణ్యం, వెంకట్రావు, నాగేశ్వరరావు, సాహితీ భారతి సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, సుబ్బారావు, ఎన్ కృష్ణ, జె కృష్ణారావు, అంజిరెడ్డి, నీలకంఠేశ్వరరావు, వై నాగేశ్వరరావు, డాక్టర్ పిసి సాయిబాబు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

వైసిపి యర్రగొండపాలెం నియోజక వర్గ అభ్యర్థి చంద్రశేఖర్

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి యర్రగొండపాలెం నియోజక వర్గ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని రెంటపల్లి, తండాలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. కులం, మతం, ప్రాంతం చూడకుండా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సచివాలయాల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కందుల వెంకటయ్య, జడ్‌పిటిసి వాగ్యా నాయక్, నాయకులు లింగంగుంట్ల రాములు, దోమకాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి కూటమి యర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి కూటమి యర్రగొండడ పాలెం నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో రాష్ట్రం 30 ఏళ్లకు వెనుకబడిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు మంత్రూ నాయక్, వెంకట్రావు గౌడ్, పూల సుబ్బయ్య, కందుల నారాయణరెడ్డి, ఒంగోలు ఆదిరెడ్డి, కంచర్ల సత్యనారాయణ గౌడ్, మంత్రూ నాయక్, షేక్ మస్తాన్‌వలి, షేక్ వలి, వేగినాటి శ్రీనివాస్, శనగా నారాయణ రెడ్డి, కాశయ్య, చిట్టేల వెంగళరెడ్డి, సంజీవరెడ్డి, తోటా మహేష్ నాయుడు, భాస్కర్, పాలడుగు వెంకట కోటయ్య, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

టిడిపి నాయకులతో సమావేశం

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని టంగుటూరు రోడ్డులో నున్న రావిపాటి వెంకటరావు పొగాకు బ్యారన్ వద్ద టిడిపి నాయ కులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. తొలుత మాగుంట శ్రీనివాసులు రెడ్డిని టిడిపి నాయకులు శాలువాలు, పూల మాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు యలమందనాయుడు, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు బత్తుల నారాయణస్వామి, వంతసరావు, రావిపాటి సీతమ్మ, వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు విశ్వం, కట్టా రాము, జనసేన, టిడిపి నాయలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - చీరాల

మండల పరిధిలోని బచ్చులవారి పాలెం గ్రామానికి చెందిన 75 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కష్ణమూర్తి, వైసిపి చీరాల నియోజక వర్గ అభ్యర్థి కరణం వెంకటేష్ సమక్షంలో మంగళవారం టిడిపిలో చేరారు. వారికి కరణం వెంకటేష్, కరణం బలరాం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలగర్ల బాలకష్ణ, సురేష్, ఆదిశేషు, తలారి నాగార్జున, కత్తి విజయ్, గోపి,పులి వసంతరావు,చప్పిడి హరీష్, పలగర్ల భవాని ప్రసాద్,కత్తి రాజేష్, నక్కల సురేష్, చప్పిడి చందు, బచ్చుల లీల, కోటి గోపి, చప్పిడి బిళ్ళ రాజు, వెంకటస్వామి, గొల్లప్రోలు ప్రదీప్, పులి వెంకటేష్,బుర్ల సాయి,పవన్, చప్పిడి హరి బాబు, వెంకట్రావు, పులి బాబు, పిన్నిబోయిన పిచియ్య, తలారి దుర్గ, వాకా వెంకటేష్, రాఘవ, బచ్చుల బంగారు బాబు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన వారితో కరణం వెంకటేష్, బలరాం

ఐదేళ్లకొకమారు అగుపడుదురు..

ఉగాది కవిత

ఎన్నికలు జరుగు ఈతరుణమ్మున
గాంతుం వింతలు కన్నులారా
పార్టీలు మార్చెడి వారు, పార్టీలు సొంతంగా
పెట్టెడివారు,తనకు పదవి దక్కకున్నను
మేలు తాయిలంబు దొరక
సర్దుకొనుచు కొనసాగు వారు
స్వంతముగా గెలుపు సాధింతు మనువారు
ఐదేళ్లకొకమారు అగుపడుదురు.
మాటి మాటికి వత్తురు ఓటు అడుగ
కానుకిత్తురు ప్రేమగ కౌగలించి
దివ్యతరంగా నిత్తురు దీవెనలను
మరలా ఐదేండ్లకు పదవి కోసం వీరు.
దెబ్బలాడినవారె తెగపూసుకునుచును
తిరుగు చుందురూ ఒకే దేహమట్లు
వారు పార్టీలను మారవచ్చు
జనం మారగరాదులె వారి వోలె
నమ్మిన బంట్లుగ తమబాట నడువంగవలె
ప్రజ సతతంబు వారి వెంట
పేరుకు మాత్రమే వీరలు ఓటర్లు
ఈ ప్రజాస్వామ్యపు ఎన్నికలను
రోజు కొక్క రీతి రోజు కొకడొచ్చి
వినయ మొప్ప నుడువ వెగటు పుట్టు
నీతి, రీతి లేని నేతల పోకడ
వెగటు పుట్టు జంతు వితతి కైనా
క్రోధి వత్సరమా!భువి కొలువు దీర రమ్ము.
ఈశ్వర రూపమా! రమ్ము నీవు
లయంజేయ మాదుర్గుణ లక్షణముల
వేగంగా రమ్ము మాలో ప్రేమ పెంపుజేయ.

- రచన
పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అద్దంకి

పేదల సంక్షేమానికి కృషి : బూచేపల్లి

ప్రజాశక్తి-కురిచేడు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు వైసిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కాటంవారిపల్లి, పేరంభట్లవారిపాలెం, గొల్లపల్లి గ్రామాల్లో డాక్టర్ బూచేపల్లి ప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు వైసిపిలో చేరారు. వారికి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ జడ్‌పిటిసి నాగిరెడ్డి, మాజీ ఎంపిపి సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు ఆవుల వెంకటరెడ్డి, మేరువ పిచ్చిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

రంజాన్ తోఫా అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రంజాన్ పండుగ నేపథ్యంలో స్థానిక గుంటూరు రోడ్‌లోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో 150 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశారు. డాక్టర్ చాపల వంశీకష్ణ సహకారంతో రంజాన్ తోఫా మంగళవారం అందజేశారు. రూ.1.75 లక్షల విలువైన 12 రకాల నిత్యావసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చాపల వంశీకష్ణ, డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ ధీరజ్, డాక్టర్ మౌనికారెడ్డి, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సరయు, డాక్టర్ ఏడు కొండలు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్ బాషా, ముస్లిం హక్కుల జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, కవి నబీ కరీముల్లా, హైకోర్టు న్యాయవాది కరీముల్లా, వర్మ గ్రాండ్ రెస్టారెంట్ నిర్వాహకులు రంగారావు, పిన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తోఫాను అందజేస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల పంచాయతీ పరిధిలోని క్రిష్టియన్ పాలెంకు చెందిన పలువురు కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి సమక్షంలో మంగళవారం టిడిపిలో చేరారు. పందిటి మనోహర్ ఆధ్వర్యంలో రేణుమాల నాగరాజు, పొనుగోటి కోటేశ్వరరావు, రేణుమాల కోటయ్య, రేణుమాల జాలయ్య, రేణుమాల మోసెస్, రేణుమాల అబ్రహం, రేణుమాల సురేష్, పొనుగోటి దావీదు కుటుంబ సభ్యులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాకల సర్పంచి సైకం చంద్రశేఖర్, పోతు రాజు, రవి, మించల బ్రహ్మయ్య, సుదర్శి ప్రసాదరావు, గర్నెపూడి సుబ్రహ్మణ్యం, పులి మాలకొండయ్య పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో డాక్టర్ ఉగ్ర

డాక్టర్ ఉగ్ర సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డుకు చెందిన 14 కుటుంబాల వారు మంగళవారం టిడిపిలో చేరారు.టిడిపి కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఉగ్ర నరసింహారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బసవతారకం కేన్సర్ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ శివ కుమార్, పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దర్శి : చంద్రబాబు తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టిడిపి కూటమి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. చంద్రన్న బాట మాదిగల బాట అనే వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహానాడు అధ్యక్షుడు పందుల మోషే, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు యోగేశ్వర్, నాయకులు సామెల్, సుధాకర్, నహెూమియా, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు

వేటపాలెం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వేటపాలెం ఎస్ఐ జి. సురేష్ ఆధ్వర్యంలో బిఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది మంగళవారం కవాతు నిర్వహించారు. సిలోన్ కాలనీ, జీవరక్షా నగర్, అనుమల్లిపేట రామనగర్, చిన్నబజారు, దేసాయిపేటలో కవాతు నిర్వహించారు. అనంతరం వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు.

సిఎంకు మేమంతా సిద్ధం ఫొటో అందజేస్తున్న బూచేపల్లి

సిఎంను కలిసిన ప్రముఖులు

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని వైసిపి దర్శి నియోజక అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తమ కుటుంబలతో మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం ఫొటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సిఎం జగన్‌తో గుంటక తిరుపతి రెడ్డి

సిఎంను కలిసిన గుంటక

వెలిగండ్ల : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని జడ్‌పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు, వెలిగండ్ల జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి వైసిపి కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌తో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి కనిగిరి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితుల గురించి గుంటక తిరుపతిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అన్ని సర్వేలు దద్దాలకు అనుకూలంగా ఉన్నాయని ఎన్నికలు ముగిసే వరకు ఇదే స్ఫూర్తిని కొన సాగించాలని ఈ సందర్భంగా దద్దాల, గుంటకు జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. అందరూ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు నియోజక అభ్యర్థి బాలినేని శ్రీనివాసులు రెడ్డి, వైసిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తో సానికొమ్ము తిరుపతి రెడ్డి

సిఎంను కలిసిన సానికొమ్ముతిరుపతి రెడ్డి

దర్శి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని రాష్ట్ర నెట్ కార్పొరేషన్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిశారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామి ఫొటోను అందజేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ వైసిపి గెలుపు కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైసిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెసిఎస్ దర్శి మండల కన్వీనర్, తూర్పు వెంకటాపురం సొసైటీ అధ్యక్షుడు బత్తినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉగాది పండుగ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో పంచాంగ శ్రావణం నిర్వహించారు. తొలుత టిడిపి కూటమి యర్రగొండపాలెం నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు, డాక్టర్ మన్నె రవీంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు రెంటచింతట శ్రీరామచంద్రమూర్తి పంచాంగ శ్రావణాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు వెంకట్రావు గౌడ్, పూల సుబ్బయ్య, కందుల నారాయణరెడ్డి, ఆదిరెడ్డి, కంచర్ల సత్యనారాయణ గౌడ్, మంత్రూ నాయక్, షేక్ మస్తాన్‌వలి, షేక్ వలి, వేగినాటి శ్రీనివాస్, శనగా నారాయణరెడ్డి, కాశయ్య, చిట్టేల వెంగళరెడ్డి, సంజీవరెడ్డి, తోటా మహేష్ నాయుడు, కె భాస్కర్, పాలడుగు వెంకట కోటయ్య, కిశోర్ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉగాది వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఉప్పుగుండూరులో పోలేరమ్మ ఉత్సవాల్లో భాగంగా ఎద్దుల బండిపై ప్రభను ఏర్పాటు చేసిన గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. వేణుగోపాళస్వామి ఆళ్వారాజుల దేవస్థానంలో పూజారి దివి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో వేదపండితుల పంచాగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ మీనిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అదేవిధంగా చదలవాడలోని

కొండపిలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి సురేష్

కొండపిలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ మాగుంట

శ్రీరఘునాయక దేవస్థానంలో ఆలయ ఇఒ దొంతా అనిల్ ఆధ్వర్యంలో వేదపండితులు పంచాగ శ్రవణం నిర్వహించారు ఉప్పుగుండూరులోని శ్రీరామ మందిరంలో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పంచాగ శ్రవణం నిర్వహించారు.

సిఎస్.పురం.: ఉగాది వేడుకలను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. మిట్టపాలెం నారాయణస్వామి, భైరవకోన రాచూరి పెద్దమ్మతల్లి చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణస్వామి ఆలయంలో హోమాలు, అభిషేకాలు. గోపూజ నిర్వహించారు. ఆలయ ఇఒ గిరిరాజు, నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించారు భైరవకోనలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ సిద్ధిరమణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులను శాలువాలతో సన్మానించారు.

ఘనంగా జాళ్లపాలెం తిరునాళ్ల

కొండపి : ఉగాది పండుగ సందర్భంగా కొండపి మండలం పెదకండ్లగుంట పంచాయతీ పరిధిలోని జాళ్లపాలెంలో శ్రీవీర బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకొని పూజలు నిర్వమించారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు దాతల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మంచినీరు,మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులు దాహం తీర్చారు. వైసిపి కొండపి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టిడిపి కొండపి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే స్వామి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జాళ్ల పాలెంలో కిటకిటలాడుతున్న భక్తులు

ఉప్పుగుండూరులో ఏర్పాటు చేసిన ప్రభ

సిఎం జగన్‌మోహన్‌రెడ్డితో వేమిరెడ్డి

సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వేమిరెడ్డి

ప్రజాశక్తి - గిద్దలూరు

వైసిపి యువ నాయకుడు వేమిరెడ్డి రామచంద్ర రెడ్డి సిఎం జగన్ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశాడు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా పొదిలి అడ్డరోడ్డు వద్ద నిర్వహించిన సిద్ధం సభకు విచ్చేసిన జగన్ మెహన్ రెడ్డి రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశాడు. ఈ కార్యక్రమంలో వైసిపి గిద్దలూరు నియోజక వర్గ అభ్యర్థి, మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి, వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సిఎం జగన్‌తో శివపురం సురేంద్ర కుమార్

సిఎంను కలిసిన శివపురం సురేంద్ర కుమార్

గిద్దలూరు : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని వైసిపి నాయకుడు, గిద్దలూరు మాజీ సర్పంచి, ఆర్యవైశ్య ప్రముఖుడు శివపురం సురేంద్ర కుమార్ కలిశాడు. మేమంతా సిద్దం బస్సు యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా పొదిలి అడ్డరోడ్డు వద్ద నిర్వహించిన సభకు విచ్చేసిన జగన్ మెహన్ రెడ్డిను సురేంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు.

అశోక్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని ముండ్లపాడు గ్రామంలో టిడిపి కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో మాజీ ఎంపిటిసి పడిగపాటి శేఖర్, మరో 200 కుటుంబాల వారు మంగళవారం టిడిపిలో చేరారు. అశోక్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ మెంబర్లు పిక్కిలి కాశయ్య, దూదేకుల చిన్న ఖాసీం పీరా, కొట్టాల దస్తగిరి, ఆరవీటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో అశోక్‌రెడ్డి

చెన్నైలో వైసిపి ఆత్మీయ సమావేశం

సిఎస్ పురంరూరల్ : ప్రజలకు సేవ చేసుకునే అవకాశం తనకు కల్పించాలని వైసిపి కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ కోరారు. తమిళనాడులో నివసిస్తున్న కనిగిరి నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనం చెన్నైలోని సోలింగ నెల్లూరు కైలాస్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ తనను ఆదరిస్తే కనిగిరి నియోజక వర్గంలో వలసల నివార పై ప్రత్యేక దష్టి సారిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కటికల వెంకటరత్నం, తమిళనాడు సేవాదళ్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, జడ్‌పిటిసి సంఘ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, కనిగిరి, సిఎస్‌పురం, పిసిపల్లి జడ్‌పిటిసిలు కస్తూరిరెడ్డి, మేకల శ్రీనివాసులు, ఓకే.రెడ్డి, కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ రెడ్డి, సిఎస్‌పురం ఎంపిపి మూడమాంచు వెంకటేశ్వర్లు, వైస్‌ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, పాలుగుళ్ల మల్లికార్జున రెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దు రమణారెడ్డి, చోడా రవి చంద్రారెడ్డి, కత్తులపల్లి రమణారెడ్డి, షేక్ బుజ్జి, మేకల బాలు, కోఆప్షన్ సభ్యుడు మాబు, నల్లమడుగుల సర్పంచి అంథోని, ఆరివేముల సర్పంచి ప్రకాష్ రెడ్డి, ఇండ్ల బాలయ్య, బొర్రాజు రమణయ్య, పులి రామచంద్రారెడ్డి, మాల్యాద్రి రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

సమస్యల సుడిలో జగనన్న కాలనీ

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పట్టణం ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ కష్టాల సుడిలో విలవిలలాడుతోంది. ఇక్కడి ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఫలితంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాపట్ల పట్టణంలో 2016 జాతీయ రహదారి బైపాస్‌కు ఆనుకుని ఉన్న ప్యాడిసన్ పేట జగనన్న కాలనీలో 1860 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. కాలనీలో సగానికి పైచిలుకు గృహ నిర్మాణాలను చేపట్టారు. అయితే వాటిలో కొన్ని గృహాలు పూర్తి కావడంతో సుమారు 300 కుటుంబాలు ఆ కాలనీలో నివాసం ఉంటున్నాయి. కాలనీలో మురుగునీటి పారుదల సదుపాయం లేదు. రహదారులు సక్రమంగా లేవు. వర్షం కురిస్తే బురదతో నడవలేని పరిస్థితి. కాలనీలో ఇళ్లకు చేరుకోవాలంటే నరకం కనిపిస్తోంది. వీటికి తోడు తాగునీటి సరఫరా సక్రమంగా లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడంతోపాటు, రూ.లక్షలు వెచ్చించి కాలనీ పడమర వైపు మునిసిపల్

ఖాళీ బిందెలతో ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ మహిళలు

అధికారులు బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. నిర్వహణ లోపంతో బోర్లు పనిచేయక మూలనపడ్డాయి. దీంతో కాలనీకి నీటి సమస్య మరింతగా పెరిగింది. మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరగడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా నిరుపేదలకు మంజూరు చేసిన నివేసన స్థలాల్లో ప్రభుత్వ వాటా రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఇంకొంత అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్నామన్నారు. సరైన వసతులు లేకపోయినా బయట అద్దె చెల్లించుకోలేక కాలనీలో అరకొర సౌకర్యాలతో సరిపెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం కాలనీవాసులకు కనీస అవసరమైన నీటిని అందించకుండా చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని అన్నారు. కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు మునిసిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతంత మాత్రంగా మునిసిపల్ నీటి ట్యాంకు తెచ్చే డ్రైవర్లు అందరికీ సక్రమంగా నీరు సరఫరా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో అనేకమంది నీటి కోసం ఇబ్బందిపడుతూ కాలనీలో నివాసం ఉండలేకపోతున్నామని చెబుతున్నారు. గృహ నిర్మాణాలకు చేసిన అప్పులకు వడ్డీలు, బయటకు వెళితే ఇంటి అద్దెలు చెల్లించలేక అనేక కష్టాలు అనుభవిస్తున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మూకుమ్మడిగా ధర్నాకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించి నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైసిపిలో చేరినవారితో పానెం హనిమిరెడ్డి

వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మంగళవారం అద్దంకి వైసిపి ఇన్‌ఛార్జి పానెం హనిమిరెడ్డి సమక్షంలో కె రాజుపాలెం టిడిపి బూత్ ఇన్‌ఛార్జి జాష్టి అనిల్‌చౌదరికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మరికొందరు టిడిపికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంక్షేమం' ఘనత జగన్మోహన్‌రెడ్డిదే: మంత్రి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర మంత్రి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని చంద్రపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆదరించి ఓట్లు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మరొక అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, జడ్పిటిసి దుంపా

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేరుగు నాగార్జున

రమణమ్మ, ఎంపిపి బుడంగుంట విజయ, సొసైటీ చైర్‌పర్సన్ దుంపా యలమందారెడ్డి, ఎంపిటిసి నల్లూరి రాధ, గ్రామసర్పంచ్ బొడ్డు రామారావు, బొడ్డువారిపాలెం సర్పంచ్ తానిపర్తి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసి నల్లూరి భాస్కరరావు, వైసీపీ నాయకులు ఆలూరి వెంకటేశ్వర్లు, బాపట్ల వెంకటరావు, పాశం శ్రీనివాసరావు, పాశం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో ఆనందబాబు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ టిడిపిలోకి చేరికలు భారీగా పెరిగాయి. భట్టిప్రోలు మండలం పల్లికోన గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు టిడిపిలో చేరారు. పల్లికోన ఎంపీటీసీ దున్న తిరుపతిబాబుతో పాటు మరికొంతమంది వైసీపీ నాయకులు వేమూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి పనిచేసే ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందిన నాటి నుంచి కనీసం ప్రజాప్రతినిధిగా కూడా ఈ ప్రభుత్వ పాలల్లో గుర్తింపు లేకుండా పోయిందని, ఈ పార్టీలో ఇమడలేక వైసీపీని వీడుతున్నట్లు తిరుపతిబాబు పేర్కొన్నారు. అలాగే చుండూరు మండలం దుండుపాలెం గ్రామానికి చెందిన సుమారు పది కుటుంబాలు వైసీపీకి చెందినవారు టిడిపిలో చేరారు. రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం, సంక్షేమ పాలన కోసం రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును జనసేన, టిడిపి ఆధ్వర్యంలో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆనందబాబు వారికి సూచించారు.

ఇఫ్తార్ విందులో ముస్లిములకు భోజనం వడ్డిస్తున్న కందుల

ముస్లిములకు 'కందుల' ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పొదిలి

రంజాన్ మాసం ముగింపు సందర్భంగా స్థానిక ముస్లిములకు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంగళవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక పెద్ద మసీదు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన స్వయంగా వారికి భోజనం వడ్డించారు. హిందూ, ముస్లింల ఐక్యతకు చిహ్నంగా ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుర్దూస్, మాజీ జడ్‌పిటిసి కాటూరి వెంకటనారాయణ బాబు(పెద్దబాబు), సీనియర్ నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గునుపూడి భాస్కర్, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, సయ్యద్ ఇమాంసాహెబ్, షాహిద్, గౌస్ బాషా, మస్తాన్‌వలి, ఎస్‌కె రసూల్, పొపూరి నరేష్, ముస్లిం పెద్దలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవి నూనె అంకమ్మరావును సత్కరిస్తున్న దృశ్యం

కవులకు సత్కారం

ప్రజాశక్తి-పొదిలి

క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పొదిలి పక్కనే ఉన్న కంభాలపాడు గ్రామంలో అంకాలమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో బెల్లంకొండ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో ఉగాది వేడుకల్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులుగా నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్రమండలి తెలుగు లోగిలి జాతీయ సంస్థ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ నేటి క్రోధి నామ సంవత్సర ఉగాది వేళ అందరికీ శుభం జరగాలని ఆకాంక్షించారు. వాదాలు, వివాదాలకు తావులేకుండా, మోదముతో ప్రజామోదంతో ముందుకు సాగాలని సూచించారు. యువత భవితకు బంగారు బాటలు వేసుకోవాలని కాంక్షించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను, ఆచారాలను పాటించడం మంచిదని అన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు బెల్లంకొండ శ్రీనివాస్, విజయలక్ష్మి, కొంకాల రామ్మోహన్, వేమా మంజుల, డిప్యూటీ డిఇఓ లక్ష్మణరావు, ఓఎస్ఆర్ సీతారామయ్య, వెన్నెల మల్లిఖార్జునరావు, డి శివప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గంలో చుండూరు మండలం వలివేరు గ్రామంలో మంగళవారం వైసీపీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్న వైసిపిని మరోమారు గెలిపించేందుకు ప్రజలు సిద్ధం కావాలని అశోక్‌బాబు కోరారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరే విధంగా పాలన కొనసాగిస్తున్నారని, దీనిని ముందుకు తీసుకు వెళ్లేందుకు మరోమారు ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. అలాగే వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామంలో అశోక్‌బాబు సతీమణి వరలక్ష్మి ఎన్నికల ప్రచారం చేపట్టారు.



ఓట్లను అభ్యర్థిస్తున్న వరికుటి అశోక్‌బాబు

చుండూరు: వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం వలివేరు గ్రామంలో ఉదయం నుంచే వైసిపి వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ప్రతి ఒక్కరినీ కలుస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను, సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రతి కుటుంబానికి చెప్పుకుంటూ మరల జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాదే శివరామకృష్ణారెడ్డి, సర్పంచులు, కార్యకర్తలు, రాజీనామా చేసిన వాలంటీర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చంద్ర బాబు నాయుడుకే సాధ్యమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనను అణిచి వేసేందుకు ఎన్డీయే కూటమి ఏర్పడిందన్నారు. పట్టణ, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు టిడిపిలోకి చేరటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలోకి వలసలు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంద న్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిడిపికి మద్దతు తెలుపుతూ పలువురు పార్టీలోకి రావటం శుభ పరిణామమని అన్నారు. రేపల్లె రూరల్ మండలం నల్లూరిపాలెం గ్రామానికి చెందిన మునిపల్లి కోటేశ్వరరావు, వీరవల్లి రాజకుమార్, తుమ్మల శ్యాంబాబు, గొరికపూడి ప్రభుదాసు, గాజులవర్తి కరుణాకర్, మామిళ్ల రవి, అల్లూరి వంశీ, అల్లూరి పండు బ్బాయి మరికొంత మంది పార్టీలోకి చేరారు. పట్టణం లోని 20వ వార్డుకు చెందిన వైసిపి మాజీ కౌన్సిలర్ పంతగాని ప్రేమలత, చార్లెస్ దంపతులు వైసీపీని వీడి టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే అనగాని వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, తాత ఏడుకొండలు, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరినవారితో 'అనగాని'

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

తెలుగుదేశం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని 37వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఒంగోలు నియోజకవర్గ టీడీపీ, జనసేన మరియు బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేడికొండ మోహనరావు, మంత్రి శ్రీనివాసరావు, మలగా రమేష్, కప్పరపు శ్రీనివాస్, పువ్వాడ ఉషారాణి, నిడమానూరి పావని, బెజవాడ మురళి పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

టిడిపి చీరాల అభ్యర్థి కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

వైసీపీ ప్రభుత్వంతో ప్రజలందరూ విసిగి పోయి మార్పు కోరుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటిలో పండగ వాతావరణమే అని టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకున్న సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో కుమారులు గౌరీ అమర్నాథ్, మహేందర్‌నాథ్‌తో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడ్డాయని, ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక సైనికుడిగా పనిచేయాలని సూచించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికీ వివరించి నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉగాది పూజల్లో ఎంఎం కొండయ్య

• ఉగాది వేడుకల్లో మంత్రి సురేష్

జరుగుమల్లి గ్రామంలోని వైస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి, కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జరుగుమల్లి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, శింగరాయకొండ

• వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

నగరంలోని సౌత్ బైపాస్ డి6 ఫంక్షన్ హాలులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి, వాసవీ క్లబ్ ప్రతినిధి రంగారావు పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, శింగరాయకొండ

'వైజాగ్' ఎఫెక్ట్‌తో..

మూతపడ్డ ఆక్వా షెడ్లు

రోడ్డున పడ్డ కార్మికులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

విశాఖపట్నంలో ఆక్వా కంటైనర్‌లో ఇతర దేశాల నుంచి మాదక ద్రవ్యాలు వచ్చాయనే వార్తల నేపథ్యంలో ఆ ప్రభావం ఇక్కడ ఆక్వా రంగంపై పడింది. రొయ్యలను చెరువు నుంచి తీసుకొచ్చి వాటి తలకాయలు తొలగించేందుకు కొన్ని ప్రాసింగ్ యూనిట్ల షెడ్ల నిర్మాణాలు ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో ఉన్నాయి. అయితే 'వైజాగ్' ప్రభావం కారణంగా ప్రస్తుతం మూతపడ్డాయి. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలలో 37కు పైగా ఆక్వా ప్రాసెసింగ్ షెడ్లను కొన్ని కంపెనీలతో పాటు కొంతమంది బయట వ్యక్తులు కాంట్రాక్టు తీసుకొని నడుపుతున్నారు. పెద్ద పెద్ద కంపెనీల నుంచి ఇక్కడికి లారీల ద్వారా రొయ్యలు తీసుకొస్తారు. ఎక్కువ శాతం మహిళా కార్మికులతో రొయ్యల తలకాయలు తొలగించి.. అక్కడ నీటితో శుభ్రం చేసి పెద్దపెద్ద ఫ్యాక్టరీలకు పంపిస్తారు. ఆ ఫ్యాక్టరీల నుంచి కంటైనర్ల ద్వారా విదేశాలకు రొయ్యలు ఎగుమతి అవుతూ వస్తుంటాయి. అయితే అలాంటి షెడ్లకూ వైజాగ్ షాక్ తగిలింది. విదేశాల నుంచి వస్తున్న ఓ ఆక్వా కంటైనర్‌లో డ్రగ్స్‌ను పట్టుకోవడంతో అది జరిగిన 24 గంటల్లోనే ఎక్కడ షెడ్లు అక్కడ మూత పడ్డాయి. ఒక్కొక్క షెడ్‌లో 120 నుంచి 160 మంది వరకు కార్మికులు ఇక్కడ అన్ని రంగాల్లో పనిచేస్తుంటారు. ఉదాహరణకు శింగరాయకొండలోని మూలగుంటపాడు వద్ద ఒక బడా కంపెనీకి చెందిన షెడ్డు ఉంది. ఆ షెడ్డులో దాదాపు 120 మంది కార్మికులు ప్రతి రోజూ పనికి వెళ్తుంటారు. రోజుకు రెండు లారీల రొయ్యలు తెచ్చి అక్కడ ప్రాసెసింగ్ చేసుకొని వారి సొంత కంపెనీకి వెళ్తుంటాయి. గత పది రోజుల నుంచి ఆ షెడ్డుని మూత వేయడం జరిగింది. టంగుటూరు టోల్‌గేట్ సమీపంలో కూడా ఒక బడా కంపెనీకి చెందిన షెడ్డు నిర్మాణం చేపట్టి అక్కడ దాదాపు 300 మంది కార్మికులు ప్రతిరోజు పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ షెడ్డు కూడా ప్రస్తుతం మూతపడింది. ఈ పనులకు వెళుతున్న కార్మికులు ప్రస్తుతం రోడ్డును పడాల్సిన పరిస్థితి నెలకొంది. జరుగుమల్లి మండలం, కేబీట్ర గుంట వద్ద ఉన్న పాలేరు ఒడ్డున కూడా ఇదే పరిస్థితితో షెడ్డును మూతేశారు. ఇలా నెల్లూరు జిల్లా ఉలవపాడు ప్రాంతంలో ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం మండలంలో, సంతనూతలపాడు మండలంలో, బాపట్ల జిల్లాలోని చీరాల ప్రాంతంలో అత్యధికంగా ఈ షెడ్లు ఉన్నాయి. ఇక్కడ షెడ్ల నిర్మాణం చేపట్టి రొయ్యల చెరువు నుంచి వచ్చిన రొయ్యలను అక్కడ బాగు చేసి.. పెద్ద కంపెనీలకు పంపించి ఆ కంపెనీల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. ఈ షెడ్ల నిర్మాణం ద్వారా ట్రాన్‌పోర్టు ఖర్చు తగ్గడంతో పాటు అదేవిధంగా అక్కడ ఉన్నవారికి ఉపాధి కల్పించే అవకాశాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం వైజాగ్ షాక్‌తో షెడ్లు మూతేయడం వల్ల కార్మికులకు ఉపాధి కరువైంది.

కాంగ్రెస్ వై.పాలెం అభ్యర్థిగా అజితారావు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో మూడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించింది. యర్రగొండపాలెం అభ్యర్థిగా బూదాల అజితారావు, పర్చూరు అభ్యర్థిగా ఎన్.శివ శ్రీలక్ష్మీజ్యోతి, సంతనూతలపాడులో పాలపర్తి విజేష్‌బాబును నియమించింది.

జనసేన దర్శి ఇన్‌ఛార్జిగా గరికపాటి

ప్రజాశక్తి-దర్శి

వెంకట్

జనసేన పార్టీ దర్శి ఇన్‌ఛార్జిగా గరికపాటి వెంకట్‌ను పార్టీ అధిష్టానం మంగళవారం నియమించింది. వెంకట్ దర్శి ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఆశించి.. ప్రచారం కూడా చేశారు. కానీ టిడిపి, బిజెపి, జనసేన కూటమి.. అభ్యర్థుల సర్దుబాటు నేపథ్యంలో ఈ స్థానాన్ని టిడిపికి కేటాయించింది. ఈ నేపథ్యంలో వెంకట్‌ను దర్శి పార్టీ ఇన్‌ఛార్జిగా పార్టీ ప్రకటించింది.

టిడిపిలో చేరిన వారితో నరేంద్రవర్మ

నరేంద్రవర్మ ఆధ్వర్యంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం, పేరలి పంచాయతీ, మేకలవారిపాలెంకు చెందిన ఇరవై మంది యువకులు వైసీపి నుండీ తెలుగుదేశం పార్టీలో చేరారు. బాపట్ల నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బాపట్ల కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ తెలుగుదేశం పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మేకల బెంజిమన్, మేకల రాము, మిక్కిలి విజేష్, ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులంతా నరేంద్ర వర్మ గెలుపుకోసం సైనికుల్లా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ చంద్రన్న పాలనలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ప్రజా సంక్షేమం కోసం బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి, ఊట్ల రామారావు, దేవల పల్లి రాజా, మద్దిపోయిన చిట్టి బాబు, మేకల విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, వైసిపిలతో విభేదాల్లేవు..

- కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నా..
- చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి వెల్లడి

ప్రజాశక్తి-వేటపాలెం, చీరాల

టిడిపి, వైసిపిలతో తనకు ఎలాంటి విభేదాలూ లేవని, తన వ్యక్తిగత అభిప్రాయాలు, నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు చీరాల నియోజకవర్గం నుండి జాతీయ పార్టీ కాంగ్రెస్ తరపున 2024 ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం వేటపాలెం మండలం, పందిళ్లపల్లిలోని ఆయన స్వగృహంలో కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. మాట్లాడారు. తాను రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీతోనే ప్రయాణిస్తూ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నానని అన్నారు. త్వరలోనే పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలతో సంప్రదించి చీరాల నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి అధికారికంగా పార్టీలో చేరతానని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి కూడా నోరు మెదపకుండా మౌనం వహించటంతో అధికార పార్టీ ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అన్నారు. తాను ప్రజాప్రతినిధిగా ఉన్న కాలంలో స్థానికంగా ఎన్నో కాలనీలు నిర్మించానని, అయితే ఎక్కడా తన పేరు పెట్టుకోలేదన్నారు. కొత్తపేటలో కుందేరులో రూ.కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టి, పార్కు నిర్మించి దానికి వ్యక్తిగతంగా పేర్లు పెట్టుకోవడం తన 18 ఏళ్ల రాజకీయ చరిత్రలో చూడలేదన్నారు. అభివద్ధి పేరు చెప్పి పార్టీ మారి కోట్ల రూపాయలు వెనకేసుకుని పిఏ పేరుతో వసూళ్లు చేపట్టారని విమర్శించారు. రౌడీయిజం అంటే పోలీసులు లేకుండా చేసేదని, పాయింట్ ఫైవ్ పోలీస్ వ్యవస్థను పెట్టుకొని చేసే దానిని రౌడీయిజం అనరని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తపేట కుందేరులో పార్కు నిర్మాణం చేపట్టటం వలన ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయి ఉన్న మురుగు నీటి వల్ల వృద్ధులు, చిన్నపిల్లలకు దోమ కాటుకి గురై త్వరగా అనారోగ్యం పాలవుతారని చెప్పారు. అలాంటి విషయాలను సైతం పక్కనపెట్టి కుందేరులో పార్క్ నిర్మాణం చేపట్టడం నీచమైన పనిగా చెప్పారు. పోలీసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. తనను కుటుంబ సభ్యునిగా భావించి ప్రజలందరూ తన గెలుపునకు కషి చేయాలని కోరారు. సభలో వేటపాలెం జడ్పీటిసి బండ్ల తిరుమల దేవి ,చీరాల జడ్పిటిసి ఆకురాతి పద్మిని, బండ్ల వెంకటేశ్వరబాబు, మాజీ సర్పంచ్ సుధాకర్, పులి శంకర్, పేతురు బాబు, మాజీ సర్పంచ్ గంజి వెంకటేశ్వర్లు, శ్రీహరి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోదడుగు రమేష్ బాబు, కొండ్రు కిరణ్, దాసరి శ్రీనివాసరావు, చీరాల మున్సిపల్ కౌన్సిలర్ ఎండ్రపాటి కెజియా, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మార్పు గ్రెగోరి పాల్గొన్నారు.